క్లుప్తంగా

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి..

సత్తుపల్లి: గణేష్ మండపాల ఏర్పాటుకు అన్ని శాఖల అనుమతి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ నర్సింహా, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వేణు కొనసాగింపు

వైరా: వైరా మున్సిపల్ కమిషనర్ బదిలీ వ్యవహారం హైడ్రామా అనంతరం పాత కమిషనర్ చింతా వేణుని కొనసాగిస్తున్నట్లు శనివారం రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీలో వేణు నల్లగొండ జిల్లా నందికొండకు బదిలీ కాగా, అక్కడి కమిషనర్ గురులింగం వైరాకు బదిలీ కాగా.. ఆ బదిలీని నిలిపి వేసేందుకు ఇక్కడి కాంగ్రెస్ నాయకులు విశ్వప్రయత్నం చేసి ఫలితం సాధించారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్‌గా చింతా వేణు కొనసాగనున్నారు.

లైన్ మార్చాలి

ముదిగొండ: మండలంలోని వెంకటాపురంలో ఎస్సీ, బీసీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్లను మార్చాలని గ్రామస్తులు ప్రజావాణిలో దరఖాస్తు చేయగా.. శనివారం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పరిశీలించి గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. త్వరలో లైన్స్ అన్ని క్లియర్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఏడీఈ రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ ఈఈ, ముదిగొండ ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా కొందరు, అనుమతులకు మించి ఇంకొందరు భవనాలు నిర్మిస్తున్నందున చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొల్లి అశోక్ చౌదరి తదితరులు శనివారం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ఓ వ్యక్తి జీ ప్లస్ 2 భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని జీ ప్లస్ 5 అంతస్తులు నిర్మించారని, మరో 11 భవనాలు ఇలాగే ఉన్నాయని తెలిపారు. ఈమేరకు అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బొజ్జ గణపయ్యలు రెడీ..

- ముస్తాబవుతున్న మండపాలు
- వేడుకల ఏర్పాట్లలో చిన్నాపెద్ద నిమగ్నం
- సందడిగా విక్రయ కేంద్రాలు
- రాజస్తాన్ కళాకారులకు జీవనోపాధి

సత్తుపల్లిటౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం విభిన్న రూపాల్లో గణనాథుల ప్రతిమలు ముస్తాబు అయ్యాయి. రాజస్థాన్ నుంచి 25ఏళ్ల క్రితం వచ్చిన పలు కుటుంబాలు ప్లాస్టర్‌ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా, హనుమాన్‌నగర్, జేవీఆర్ పార్కు, పాతసెంటర్ ప్రాంతాల్లో అడుగు సైజు నుంచి 12అడుగుల వరకు గణేష్ విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం ఉండగా గణనాథులకు విక్రయ కేంద్రాల వద్ద తుది మెరుగులు దిద్దుతున్నారు. చవితి పందిళ్లల్లో వీటిని పూజించేందుకు పాల్వంచ, కొత్తగూడెం, చింతలపూడి ప్రాంతాల నుంచి ఉత్సవ నిర్వాహకులు సత్తుపల్లి వచ్చి విగ్రహాలను తీసుకెళ్తున్నారు.

సైజు ఆధారంగా ధర..


రాజస్థానీ కళాకారులు అడుగు సైజు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు గణపయ్య ప్రతిమలను వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా సిద్ధం చేశారు. మార్కెట్‌లో రంగురంగుల గణనాథుల విగ్రహాలు విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకుంటున్నాయి. రూ.500 నుంచి రూ.40వేల వరకు సైజును బట్టి విగ్రహాల ప్రతిమల ధరలు పలుకుతున్నాయి. సత్తుపల్లి పరిసర ప్రాంత ఉత్సవ కమిటీలు, భక్తబృందాలు ఇప్పటికే వారికి కావాల్సిన విగ్రహాలకు బుకింగ్ చేసుకుంటున్నారు.

ముస్తాబవుతున్న మండపాలు..

ప్రత్యేక సెట్టింగ్‌లు.. విద్యుత్ దీపాలు.. వచ్చదనం కనువిందు చేసేలా పూలకుండీలతో చవితి మండపాలను ముస్తాబు చేస్తున్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీహనుమాన్ యూత్ ఆధ్వర్యాన 30 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా శ్రీప్రసన్న గణపతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జేవీఆర్ పార్కు ఎదురుగా గల ప్రసన్నగణపతి క్షేత్రంలో 25ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యాన 16ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు ఉత్సవ కమిటీలు మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నాయి. ఇలా పలు ఉత్సవ కమిటీలు అనేక సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పలు కాలనీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. వీరితో పాటు పలు ఆలయాల్లోనూ గణపతి ఉత్సవాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేలా అధికారులు సైతం చర్యలు తీసుకుంటున్నారు.



విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు



ఆకర్షణీయంగా మహాగణపతి

పాతికేళ్లుగా ఇదే వృత్తి..



మా కుటుంబం పాతికేళ్లుగా ఇక్కడే ఉంటూ అంతా ప్లాస్టర్‌ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాల తయారీపైనే ఆధారపడి ఉన్నాం. విగ్రహాల తయారీకి కావాల్సిన సామగ్రిని ఇతర రాష్ట్రాలనుంచి తెప్పించి నెలల తరబడి విగ్రహాల తయారీలో నిమగ్నమవుతాం. రెండేళ్లుగా ముడిసరుకుల ధరలు భారీగా పెరిగాయి. విగ్రహాలు పూర్తిస్థాయిలో అమ్ముడుపోతేనే గిట్టుబాటు అవుతుంది.

– కిరణ్, రాజస్థాని కుటుంబం, సత్తుపల్లి

విగ్రహాల తయారీతో ఉపాధి..



రాజస్థాన్ నుంచి 15ఏళ్ల క్రితం వచ్చాం.. విగ్రహాల తయారీతో జీవనోపాధి పొందుతున్నాం. ఒక్కొక్క విగ్రహాన్ని తయారు చేయడానికి చాలా శ్రమపడాల్సి వస్తోంది. గణపతులతో పాటు దుర్గామాత విగ్రహాలు తయారు చేశాం. చిన్నప్పటి నుంచే వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతాను. వివిధ రకాల విగ్రహాలు తయారు చేసుకుంటూ ఇక్కడే జీవిస్తున్నాం.

– విష్ణు, రాజస్థాని కళాకారుడు, సత్తుపల్లి

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: సెప్టెంబర్ 13దీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీస్ అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం కోర్టులో న్యాయాధికారులతో కలిసి పోలీస్, బార్ అసోసియేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత ఎక్కువ కేసులు పరిష్కారించేందుకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్‌మీరా ఖాసీంసాహెబ్, జూనియర్ సివిల్‌జడ్జి సుమబాల, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వడ్డి లావణ్య, సెకండ్‌క్లాస్‌మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, ఏసీపీ రఘు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రదీప్, ఏజీపీ జి.రామచంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు

చట్టాలపై అవగాహన

మధిర: వయోవృద్ధుల సంరక్షణ చట్టాలపై మధిర కోర్టు జడ్జి ప్రశాంతి అవగాహన కల్పించారు. శనివారం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. వృద్ధులు అవసరమైనప్పుడు కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవా సంస్థ సహకారం ఉచితంగా పొందవచ్చునని సూచించారు. అనంతరం న్యాయమూర్తి ప్రశాంతిని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పారుపల్లి వెంకటేశ్వరరావు, తెలంగాణ వయోవృద్ధుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావు, న్యాయవాది చావలి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'యూరియాను దారి మళ్లించారు'

సత్తుపల్లి(కల్లూరు): కేంద్రం పంపించిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కల్లూరులో బీజేపీ మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన చేపట్టి.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పల్లె నిద్ర

తల్లాడ: మండలంలోని కలకొడిమ, బస్వాపురం, కుర్నవల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యకమం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సమస్యలపై ఎంపీడీఓ సురేష్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, తల్లాడ మండల బీజేపీ అధ్యక్షులు నాగులు, వెంకటరామారావు, రమేష్, కిరణ్, సాయిచంద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి..



కార్మికులతో మాట్లాడుతున్న సీఈ శ్రీనివాసరావు

వైరా: మిషన్ భగీరథ మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని కార్మికులు పేర్కొన్నారు. శనివారం వైరా రిజర్వాయర్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కార్మికులు సుమారు 3 గంటల పాటు ఆందోళన చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు భగీరథ సీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్మికులందరికీ నాలుగునెలల వేతనాలను విడతల వారీగా వచ్చేనెల 15లోగా వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు రవి, రాములు, అనంతరాములు, బాలకృష్ణ, రాంబాబు, వెంకయ్య తదితరులున్నారు.

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం

సత్తుపల్లిరూరల్: బ్రహ్మకుమారీల అందిస్తున్న సేవలు అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.ఆకాష్, బ్రహ్మకుమారి రాధిక, ప్రిన్సిపాల్ గోపి, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు కృష్ణారావు, రవి, రమేష్, సుజలరాణి, రాంబాబు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రశాంత్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం

తల్లాడ: మండలంలోని గాంధీనగర్‌తండాలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు షుగర్, బీపీ, పల్స్, వెయిట్ నిర్ధారణ పరీక్షలు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు, డీసీ రాజశేఖర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష తులసీ దళార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలంలోని అమ్మపేటలో స్వయంభువుగా వెలసిన శ్రీ వెలగొండ వేంకటేశ్వరస్వామి గట్టుపై శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గుంటూరు పద్మనాభాచార్యుల ఆధ్వర్యంలో బొర్రా వాసుదేవాచార్యుల శిష్య బృందంచే స్వామికి లక్ష మంత్రోచరణలతో లక్షదళార్చన కార్యక్రమంలో పూజలు చేశారు. కోదాడ మండలం లక్ష్మీపురానికి చెందిన భక్తులు గొని ఉకలాద్రి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

గురుకులాల్లో అధికారుల తనిఖీ

మధిర/కొణిజర్ల: మధిర మండలం కృష్ణాపురంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ముదిగొండ తహసీల్దార్ సునీత ఎలిజబెత్, మధిరలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను స్థానిక తహసీల్దార్ ఆర్.రాంబాబు శనివారం తనిఖీ చేశారు. అలాగే, కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులాన్ని ఎంపీడీఓ ఆర్.ఉపేంద్రయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్ షెడ్లు, డార్మెటరీలను పరిశీలించి సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశాక ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ప్రిన్సిపాళ్లు నాగమణి, ఐనాల సైదులు, డిప్యూటీ వార్డెన్ నిర్మల, హెచ్ఎస్ తులసి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: దాడి ఘటనలో మండలంలోని నేరడకు చెందిన బండి నాగేంద్ర, ఆమె భర్త, కుమారుడిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మట్టా సంధ్య, నాగేంద్ర మధ్య వివాదం నెలకొనగా.. నాగేంద్ర, ఆమె భర్త, కుమారుడు కలిసి దూషిస్తూ సంధ్యపై దాడి చేశారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

పనిదినాలు కోల్పోతున్నాం... పట్టించుకోండి

కారేపల్లి: పనిదినాలు కోల్పోకుండా తమకు న్యాయం చేయాలని మాధారం డోలమైట్ మైన్స్ రైల్వే లైన్ కార్మికులు కోరారు. ఈ సందర్భంగా మండలంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ డోలమైట్ మైన్స్ ఎదుట శనివారం టీయూసీఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్వహణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ తీసుకోకపోవడంతో కార్మికులకు నెలలో తక్కువ పని లభిస్తోందని, తద్వారా కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోందని తెలిపారు. ఈమేరకు కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి, యాజమాన్యమే కార్మికులకు 26రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు షేక్ ఖైరుద్దీన్, బాదావత్ వీరూ, రవికుమార్, ఇబ్రహీం, హుస్సేన్, ఈరన్న, గుండెబోయిన లక్ష్మీనారాయణ, కళావతి, ప్రసాద్, మీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటం చేయాలి

వేంసూరు: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించే వరకు బీసీలందరు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల ఎదుట ప్రజాపోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. శనివారం వేంసూరు సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో రంగరావు, జగన్‌మోహన్‌రావు, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపులేదు'

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేదని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడి.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి వచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని పాటిమీదిగుంపు గ్రామంలో మాజీ సర్పంచ్ కరపటి రాములు 12వ వర్ధంతి నిర్వహించగా.. ఆయన హాజరై రాములు స్తూపం వద్ద పార్టీ జెండా ఎగురవేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల ఇబ్బందులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, నరేందర్, రామారావు, ధనమ్మ, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సురక్ష పథకాలపై అవగాహన

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో శనివారం పీఎం సురక్షా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ ఖమ్మం రీజియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఖమ్మం రీజనల్ మేనేజర్ రాజశేఖర్, ఆర్థిక సమ్మేళనం మేనేజర్ సురేష్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సురక్ష యోజన పథకాలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఎస్‌బీఐ జీవితా బీమా రూ.20తో చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ నిర్వాహకులు భరత్, వెంకటి స్వప్న తాండ్ర, బానోత్ కృష్ణ, సురేష్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్‌సీసీలో ఎంపికలు



ఎన్‌సీసీ విద్యార్థులతో కల్నల్ భద్ర

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీలోకి ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 80మంది విద్యార్థులకు రాత పరీక్షతో పాటు శారీరక పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కల్నల్ భద్ర, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నవీన్ యాదవ్, ప్రిన్సిపాల్ ఎల్.గోపి, కేర్‌టేకర్ రవికుమార్, రెహ్మాన్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన గుర్రం సుజాత, బత్తుల స్వరూప, కోయిన్ని పిచ్చమ్మ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ. 1.16 లక్షల విలువైన చెక్కులు అందజేయడం జరిగిందన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కొణిజర్ల: మండలంలోని దిద్దుపూడి రెవెన్యూ లోని 82, 83 సర్వే నంబర్లలోని భూమిలో నలభై ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళితులకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ అరుణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, పెద్దమల్ల రత్తయ్య, అమర్లపూడి మరియమ్మ, అనిల్, భాస్కర్, రాము, రమేష్, సురేష్, ఏసు, నాగరత్నం, బాలశౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వేంసూరు: వానాకాలంలో విద్యుత్ మోటార్ల వద్ద రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఈ అంకారావు అన్నారు. శనివారం మండలంలోని లచ్చన్నగూడెంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ

వేంసూరు: మండలంలోని మర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులకు బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో మర్లపాడు అరుణోదయ ఎంటర్ ప్రైజెస్ షాపు ఆధ్వర్యంలో బయో జైమ్ ప్రగతి స్కాలర్ షిప్ అందించారు. పాఠశాలలో పది చదువుతున్న 10మంది మెరిట్ విద్యార్థులకు రూ.2,500 చొప్పున అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, కంపెనీ మేనేజర్ రాఘవరావు, బండి అనిల్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి రూ. 1.50 కోట్లు

మధిర: మధిర మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ. 1.50కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. ప్రస్తుత కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనానికి భట్టి నిధులు మంజూరు చేయించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజలు భట్టికి కృతజ్ఞత లు తెలిపారు.

ఆకట్టుకున్న 'అంతరిక్ష శాటిలైట్' నమూన

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని కేపీఆర్ గౌతమ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న భూక్యా హనీష్ కుమార్ శనివారం పాఠశాలలో అంతరిక్ష స్వరూపం .. శాటిలైట్ విధానం.. స్పేస్ స్టేషన్ నమూనాలతో తయారు చేసిన ప్రాజెక్టు విశేషంగా ఆకట్టుకుంది. సుమారు రెండు నెలల పాటు శ్రమించి నమూనా ప్రాజెక్టును తక్కువ ఖర్చుతో వృథా మెటీరియల్‌తో తయారు చేసినట్లు తెలిపారు. అనంతరం హనీష్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్నాకు తరలిన ఉపాధ్యాయులు

మధిర: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికై హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు శనివారం మధిర నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ వినోదరావు, మండల అధ్యక్షులు బండారు నాగరాజు తదితరులు మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

వనమహోత్సవం..

కల్లూరురూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో వనమహోత్సవ కార్యక్రమం శనివారం ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోకవరం గ్రామ పంచాయతీలో జాతీయ రహదారి వెంట మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ జేఈ పుల్లారావు గోకవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

చింతకాని: ఈనెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో శనివారం మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు.

సురవరం మృతికి సంతాపం

కొణిజర్ల/బోనకల్: సీపీఐ సీనియర్ నేత, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లాకమిటీ సభ్యుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, పార్టీ మండల కార్యదర్శి ఆనందరావు, జిల్లా నాయకుడు తూము రోషన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కొణిజర్లలో పలువురు నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్, సోమయ్య, వెంకయ్య, రాంబాబు, అనిల్, మరియమ్మ, సురేష్ భాస్కరరావు, జయరాజు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి



మధిర: నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



పెనుబల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

- **మధిర/బోనకల్/చింతకాని/ఎర్రుపాలెం:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, ఎం.ఉషాశారద లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి పమ్మి అనిత, జిల్లా నాయకుడు రుద్రప్రదీప్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ నాయకుడు నూతక్కి నర్సింహారావు, పార్టీ నియోజక వర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు కొమ్మినేని కృష్ణారావు, గోపి, శ్రీహరి చౌదరి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ఉందని, రానున్న స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అలాగే మండలానికి ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రైతులకు సరిపడా యూరియా అందించి, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాన్నారు. అదేవిధంగా ఎర్రుపాలెంలోని ములుగుమాడుకు చెందిన కార్యకర్త లంకా వెంకటేశ్వరరావు అనారోగ్యం బారిన పడగా ఆయన సతీమణికి రూ.15వేలు నగదు అందచేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శివరాజు సుమంత్, మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల కమిటీ అధ్యక్షురాలు మౌనిక, నాయకులు విజయరాజు, సురేష్, పాపారావు, రవి, నాగేంద్ర, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, సురేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.
- **సత్తుపల్లి/పెనుబల్లి:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. బీజేపీ నాయకులు తహసీల్దార్ సత్యనారాయణకు వినతపత్రం అందించారు. స్థానిక ఎన్నికల్లో పరిపాలన పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి రాథక్లడ్, అధికార ప్రతినిధి మధుసూదన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి రాము, నాగరాజు, వెంకటస్వామి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, మంగేశ్వరరావు, మహేష్, తిరుపతమ్మ, శివకృష్ణ, మోహన్‌రావు, బాబు, నాయుడు రాఘవరావు, విజయ్, నారాయణ, శివ, నరేష్, శ్రీను, రహ్మాతుల్లా పాల్గొన్నారు.
- **కొణిజర్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ నారపోగు అరుణకు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు కవిడ మురళి, జిల్లా కార్యదర్శి నరేష్, రాజేష్, సత్యనారాయణ, జనార్ధన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా !

ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ నెల నాలుగో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాలు ఈ వారం అమమల్లోకి వచ్చాయి. ఈ సందర్భంగా విద్యార్థులు బ్యాగ్‌లు లేకుండా పాఠశాలకు వచ్చారు. ఈమేరకు ఉపాధ్యాయులు వారికి మట్టి గణపతి విగ్రహాల తయారీపై అవగాహన కల్పించారు. అలాగే, చిత్రలేఖనం, క్విజ్, కవితల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా రోజంతా ఆటపాటలతో గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



తల్లాడ : సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులు



సత్తుపల్లిటౌన్: బ్యాగ్ లేకుండా బాలికోన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు



సత్తుపల్లిరూరల్ : కాకర్లపల్లి బోడు పాఠశాలలో చిత్రాలు, మట్టి గణపతులతో విద్యార్థులు